క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం అందజేత



అన్నదానానికి విరాళం అందజేస్తున్న సాయితేజ దంపతులు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్లమ్మ సన్నిధిలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదానానికి సోమవారం పట్టణానికి చెందిన నాగశివ సాయితేజ, మౌనిక దుర్గా సాయివాసవీ దంపతులు రూ.56,001 విరాళంగా అందజేశారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరీదేవికి అభిషేకాలు



బాలత్రిపుర సుందరిదేవికి అభిషేకాలు చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రావణ మాసం పౌర్ణమి సందర్భంగా భీమవరం మెంటే వారి తోటలోని బాలా త్రిపుర సుందరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివద్ధి కమిటీ అధ్వర్యంలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్‌చే పట్టణానికి చెందిన చినిమిల్లి వీర వెంకట రామ ఆదినారాయణ, లక్ష్మి దంపతులతో అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాలతో అభిషేకాలను వేదమంత్రాలతో నిర్వహించారు. అనంతరం అమ్మవారికి 2 వేల గాజులతో పూజలు చేసి, ప్రత్యేక అలంకరణ చేశారు.

చెత్త నుంచి సంపద సృష్టిపై శిక్షణ



శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ

ఆకివీడు: పంచాయతీల ఆదాయం పెంపొందించుకునేందుకు చెత్త ద్వారా సంపద పొందాలని ఎంపీపీ కతారి జయలక్ష్మి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జీపీడీపీ, శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి, సేకరించి వాటి ద్వారా వర్మీ కంపోస్టు తయారు చేసి ఆదాయం పొందాలన్నారు. ఎంపీడీఓ కె.వాణి, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బధిర పాఠశాలలో రాఖీ పండుగ



భీమవరం బధిర పాఠశాలలో రాఖీ పండుగ సందడి

భీమవరం: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర బధిర పాఠశాలలో విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. బధిర విద్యార్థినులు, విద్యార్థులకు రాఖీలు కట్టారు. అనంతరం ఒకరికొకరు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మీనరసమ్మ, కార్యక్రమ నిర్వాహకుడు అల్లు శ్రీనివాస్ మాట్లాడారు. మానవత సంస్థ భీమవరం శాఖ కోశాధికారి గ్రంధి కుమార వర ప్రసాద్, సభ్యులు చాన్‌భాషా పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీ కోసం ఎంవోయూ



ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలో ఎంవోయూ పత్రాలు అందించుకుంటున్న దృశ్యం

భీమవరం: విద్యార్థులకు నూతన టెక్నాలజీ అందించేందుకు బహుళ జాతి సంస్థ ఇన్ఫర్మేషన్ అండ్ డేటా సిస్టమ్స్ (ఐడీఎస్) తో భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎంవోయూ కుదుర్చుకుంది. దీనికి సంబంధించిన పత్రాలను సోమవారం ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, ఐడీఎస్ హెడ్ బిజినెస్ స్ట్రాటజీ ఇన్ఫర్మేషన్ డేటా సిస్టమ్స్ ఎడవల్లి సునీల్ సుబ్రహ్మణ్యం మార్చుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ విద్యార్థులకు ఎమర్జింగ్ టెక్నాలజీస్ అయిన బ్లాక్‌చైన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) అనే అంశాలపై మారుతున్న నూతన టెక్నాలజీని విద్యార్థులకు అందించేందుకు ఎంవోయూ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కళాశాల అధ్యాపకులు, పలు డిపార్ట్‌మెంట్ హెడ్‌లు పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న లీకేజీలు

- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం
- సక్రమంగా మరమ్మతులు చేయకుండా బిల్లులు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో అనేక ప్రాంతాల్లో మంచినీటి పైపు లైన్ లీకేజీలు ఏర్పడి రోజుకు వేల లీటర్లు వృధా అవుతున్నా మున్సిపల్ కమిషనర్, వాటర్ సరఫరా విభాగం అధికారులు పట్టించుకోవడం లేదు. ఫిల్టర్ చేసిన మంచి నీరు ఇలా లీకేజీల ద్వారా బయటకు పోతున్నా మరమ్మతులు మాత్రం చేపట్టడం లేదు. ఈ లీకేజీలు చాలా కాలంగా ఉన్నా అధికారులకు కనీసం చీమకుట్టినట్టుగా లేకపోవడం దారుణం. మంచినీరు లేక పట్టణంలో పలు ప్రాంతాల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదు. రోజుల తరబడి నీళ్ల కోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పైపు లీకేజీల ద్వారా నీరు వృధాగా పోతున్నా మరమ్మతులు చేసి, సక్రమంగా తాగు నీరు అందించాలనే ఆలోచన మున్సిపల్ అధికారులకు లేదు.

గొయ్యి తవ్వి పూడ్చి బిల్లు మింగేస్తున్నారు

పైపులైన్ లీకేజీ అవినీతి అధికారులకు కాసులు కురిపిస్తోంది. పైపు లీకేజీ ప్రధాన సెంటర్‌లో ఉంటే పటిష్టంగా మరమ్మతులు చేస్తారు. అదే ఎక్కడైనా శివారు, ప్రజలు గమనించని ప్రాంతంలో ఉంటే మాత్రం మున్సిపల్ కమిషనర్ దగ్గర నుంచి వాటర్ సరఫరా విభాగం అధికారులకు కాసులు ముట్టినట్టే. పైపు లీకేజీకి సంబంధించి అరకొర మరమ్మతులు చేయడం, బిల్లులు దోచేయడం వంటివి చేస్తున్నారు. గుంత తవ్వి పూడ్చి వేసి మరమ్మతులు చేసినట్లు బిల్లు చేసుకోవడం పరిపాటిగా మారింది. ఈ ఏడాది దాదాపు రూ.40 లక్షల వరకు ఈ విధంగా బిల్లులు చేసుకున్నట్లుగా కూడా ఆరోపణలు ఉన్నాయి. ప్రజల సొమ్ము దోచుకోవడం కాదు ప్రజలకు మంచినీరు అందించాలి, పైపు లైన్లపై సక్రమమైన నిర్వహణ ఉండేలా చూడాలని భీమవరం మున్సిపల్ అధికారులకు లేదు. లీకేజీల మరమ్మతుల దోపిడీపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేస్తే లీకేజీ, అవినీతి రెండూ బయట పడతాయి.



మెంటేవారి తోటలో అండర్ పాస్ సమీపాన పైపు లీకేజీతో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



ఎఫ్‌సీఐ గోడౌన్స్ ఎదురుగా పీపీ రోడ్డులో పైపు లీకేజీ

లీకేజీలు ఇవి:

పట్టణంలో చినరంగని పాలెం వాటర్ ట్యాంకు పైపులైన్‌కు సంబంధించి రిలయన్స్ బంకు, పీపీ రోడ్డు గోడౌన్స్, ఆంధ్రా బ్యాంకు, సెంటిమేరిస్, ఆర్టీసీ క్వార్టర్స్, ఓవర్ బ్రిడ్జి వద్ద, కుముదవల్లి రోడ్డులోని వాటర్ ట్యాంకు పైపులైన్‌కు సంబంధించి ఆంజనేయస్వామి గుడి వద్ద, బీజేపీ ఆఫీసు వద్ద, కల్యాణ మండపం, మార్కెట్ యార్డ్, తదితర ప్రాంతాల్లో లీకేజీలు ఉన్నాయి. గునుపూడి ట్యాంకు పైపులైన్ లెప్రసీ కాలనీ రోడ్డు, తదితర ప్రాంతాల్లో లీకేజీలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు పైపు లైన్లను పర్యవేక్షణ చేసి, లీకేజీలకు పటిష్టమైన మరమ్మతులు చేసి, నీళ్లు సక్రమంగా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలి.

దోషులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతా ఘటనకు నిరసనగా స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో మానవహారం నిర్వహించిన దృశ్యం

ఆకివీడు: కోల్‌కతా ఘటనపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజకీయం చేస్తూ, దోషులపై కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఐద్వా జిల్లా నాయకురాలు సందక ఉదయకుమారి ఆరోపించారు. వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటనలపై స్థానిక ప్రధాన సెంటర్‌లో సోమవారం నిరసన ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. తక్షణం సంఘటనకు కారకులైన దోషుల్ని పట్టించి, శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు టి.ప్రసాద్, నాయకులు బీ.రాంబాబు, బి.కల్యాణి, పి.కృష్ణవేణి, లక్ష్మణ్, రోహిత్, సాగర్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థి మృతికి కారకులను శిక్షించాలి

ఉండి: కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థిని మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని నియోజకవర్గ జనసేన కన్వీనర్ జుత్తిగ నాగరాజు అన్నారు. సోమవారం ఉండి సెంటర్‌లో డాక్టర్ మృతికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు ఈ- క్రాప్ నమోదు చేయించుకోవాలి



ఈ - క్రాప్ నమోదు వివరాలను అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ రావి రాంబాబు

భీమవరం అర్బన్: సార్వా సాగులో రైతులు తప్పకుండా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ రావి రాంబాబు సూచించారు. భీమవరంలోని గునుపూడిలో రైతులకు అప్‌లోడ్ చేస్తున్న ఈ-క్రాప్ తీరును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రావి రాంబాబు మాట్లాడుతూ ఎవరైతే సాగు చేస్తున్నారో ఆ రైతు పొలంలో నిలబట్టి ఈ క్రాప్ నమోదు చేస్తారన్నారు. ఈ క్రాప్ నమోదు చేయించుకోవడం వలన పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాలు వలన పంట దెబ్బతింటే నష్ట పరిహారం, తదితర ప్రభుత్వ పథకాలు లబ్ధి చేకూరతాయన్నారు. మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 1232 ఎకరాలను ఈ క్రాప్ నమోదు చేశామన్నారు. వరినాట్లు వేసిన రైతులు త్వరితగతిన ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. తహసీల్దార్ రావి రాంబాబు వెంట వీఆర్‌వో, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, రైతులు ఉన్నారు.

అర్జీలు గడువులోపు పరిష్కరించాలి

భీమవరం: అర్జీదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ×ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ×ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై 8 ఫిర్యాదులు అందాయన్నారు.

కృత్యాధార బోధనలో మేటి వెంకటలక్ష్మి



ఉపాధ్యాయురాలు గుంపర్తి వెంకటలక్ష్మిని సత్కరించిన అధికారులు

ఆకివీడు: కృత్యాధార బోధనతో విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపొంది, మేథస్సు మరింతగా వృద్ధి చెందుతుందని జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి రామకోటేశ్వరరావు చెప్పారు. మండలంలోని అయిభీమవరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యా బోధనను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీషు, గణితం, సైన్సు విభాగాలకు చెందిన అంశాలను కృత్యాధార విధానంలో రూపొందించి, విద్యార్థులకు బోధనోపకరణాలు ఉపయోగపడే విధంగా ఉపాధ్యాయురాలు గుంపర్తి వెంకటలక్ష్మి చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో సీఎంఓ వై.రామ చంద్రశేఖర్‌రావు పాల్గొనగా ఉపాధ్యాయురాల్ని సర్పంచ్ గాలి సామ్రాజ్యం, ఉపాధ్యాయులు, ఎంఈఓలు రవీంద్ర, సీతారామయ్య అభినందించారు.

తాగునీటి పరిరక్షణకు అందరూ సహకరించాలి

ఉండి: తాగునీటి పరిరక్షణకు ప్రజలంతా విధిగా సహకరించాలని ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. సోమవారం ఉండి వ్యవసాయ మార్కెట్ వద్ద పాములపర్రు పంట కాలువను, ఏఎంసీ పాత కార్యాలయ భవనాన్ని, ఉప్పులూరు జెడ్పీ హైస్కూల్‌ను ఆయన పరిశీలించారు. పాములపర్రు కాలువ కలుషితంపై అధికారులతో మాట్లాడి కాలువను ఆనుకుని ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. రోడ్డు పక్కన ఆక్రమణలను వెంటనే తొలగించాలని తెలిపారు. ఉండిలోని రైతు భరోసా కేంద్రాన్ని అక్కడి నుంచి తరలించి ఏఎంసీలోని పాత కార్యాలయ భవనాన్ని వ్యవసాయ శాఖకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఉప్పులూరు స్కూల్ భవనాన్ని పరిశీలించానని పాత భవనం స్థానంలో అవసరం మేరకు కొత్త భవనం నిర్మించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. స్కూల్ గ్రౌండ్ పూడిక పనులు చేపట్టాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ జుత్తిగ నాగరాజు, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామ సభలు



కోలమూరు గ్రామ సభలో మాట్లాడుతున్న ఉపసర్పంచ్ రామకృష్ణంరాజు,అధికారులు

ఉండి: మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎం గోవిందరావు తెలిపారు.వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఉపసర్పంచ్ నడింపల్లి రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో కోలమూరులో సామాజిక తనిఖీ కార్యక్రమం ముగియడంతో పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల నుంచి మండల వ్యాప్తంగా 12 టీమ్‌ల ఆధ్వర్యంలో గత ఆర్థిక సంవత్సరంలో సామాజిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన పనులపై బృందాలు తనిఖీలు నిర్వహించి నివేదికను ఈ నెల 23న మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించే సభలో అధికారులకు అందజేస్తారని తెలిపారు. మస్టర్ నమోదు, సామాజిక పింఛన్లలో కొన్ని లోపాలు కనుగున్నామని వాటిని సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌ల ద్వారా పరిశీలిస్తున్నామన్నామని వారు తెలిపారు. ఒంటరి మహిళలు సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించలేదని స్థానిక వీఆర్వో వాటిని ధ్రువీకరిస్తే సరిపోతుందని తెలిపారు. అభ్యంతరాలు ఫిర్యాదులుంటే వాటిని మండల సభలో చర్చించి పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పేరిచర్ల కృష్ణంరాజు, డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్ డీ వెంకటేష్‌నాయక్, వీఆర్వో టీవీ అప్పలాచార్యులు, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.

జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ సాధించాలి

కాళ్ల: జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ సాధిస్తే ఉన్నత చదువుల వరకూ విద్యార్థికి ఆర్థిక సహకారం అందుతుందని పలువురు ఉపాధ్యాయులు సూచించారు. కాళ్ల మండలం కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ సాధన అంశంపై ఒక రోజు వర్క్ షాప్ సోమవారం నిర్వహించారు.ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వందేమాతరం ఫౌండేషన్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, ఐక్య నేషనల్ ఫౌండేషన్, సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాలలోని 7, 8 తరగతి విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేకంగా వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి భువనేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి మ్యాథమెటిక్స్ ప్రొఫెసర్ ఎం శ్రీనివాస్, ఐక్య నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ వై శ్రీనివాసాచారి, వందేమాతరం ఫౌండేషన్ ఏపీ చైర్మన్ పేరిచర్ల అశోక్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఉన్నత పాఠశాలలో చదువుకొని స్కాలర్‌షిప్ సాధించి ఉన్నత చదువులు చదువుతున్న ఇద్దరు విద్యార్థినులను కూడా వారికి పరిచయం చేశారు. వారి అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.

శిక్షణ కార్యక్రమం ప్రారంభం

పాలకోడేరు: పాలకోడేరు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నుంచి మూడు రోజులు పాటు నిర్వహించే శిక్షణా తరగతులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి ఈ శిక్షణ తరగతుల్లో గ్రామ సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు గ్రామాభివృద్ధి, డంపింగ్ యార్డుల నిర్మాణం, నిర్వహణపై శిక్షణ ఇస్తారు. గ్రామాభివృద్ధిపై పక్కా ప్రణాళిక డంపింగ్ యార్డుల అభివృద్ధి అంశంపై మొదటి రోజు ఎంపీడీవో ఎం మురళిగంగాధర రావు, ఈఓపీఆర్డీ ఆంజనేయులు అవగాహన కల్పించారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఫలప్రదం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉప విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు

కాళ్ల: నెలకు ఒకసారి నిర్వహించే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులందరూ పాల్గొని తమ అనుభవాలను, ప్రణాళికలను పంచుకోవడం ద్వారా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను విజయవంతం చేయాలని భీమవరం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఎన్. శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోపల్లెలో నిర్వహిస్తున్న ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పిల్లలు ఆశించిన సామర్థ్యాల సాధనకు ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కోరారు. చక్కని బోధన అభ్యసన సామగ్రి తయారు చేసుకుని ఉపయోగించడం ద్వారా ఆశించిన ఫలితాలు సాధించవచ్చని ఆయన అన్నారు. మండల విద్యాశాఖ అధికారి1, 2 రవీంద్ర, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లల తల్లిదండ్రుల బాధ్యతను కూడా ఉపాధ్యాయులే తీసుకొని వారి ఉన్నతికి కృషి చేయాలని కోరారు. రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన స్వామి, పి. పాపారావు పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె. నిర్మల, సెక్రటరీ వి రవికుమార్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్పంచులకు శిక్షణ తరగతులు ప్రారంభం

కాళ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మండలంలోని 21 పంచాయతీల సర్పంచ్, కార్యదర్శులకు మూడురోజుల పాటు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామని ఎంపీడీఓ జి.స్వాతి తెలిపారు. తొలిరోజు డీపీఆర్సీ రామలక్ష్మి హాజరై సర్పంచ్, కార్యదర్శులకు పరిపాలనపై వారికి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

వీరవాసరం: మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా కిషోర బాలికలకు బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం తోలేరు హైస్కూల్లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.సుజాత రాణి మాట్లాడుతూ ఆడపిల్లలు బాగా చదువుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఉన్నత విద్య అభ్యసించడం ద్వారా మహిళా సాధికారక సాధ్యమవుతుందన్నారు. తన నిర్ణయాలు తాను తీసుకునే స్వేచ్ఛ లభిస్తుందని తెలిపారు. భీమవరం ప్రాజెక్ట్ ఆఫీసర్ టీకేవీ లక్ష్మీ కాంతం మాట్లాడుతూ వివాహ వయస్సు, బాల్య వివాహ నిరోధక చట్టాన్ని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పీబీవీఎల్ సరోజినీ, సీహెచ్ పార్వతి, జ్యోతి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దు తగాదాలపై వేర్వేరు కేసులు నమోదు

ఆకివీడు: స్థానిక చిలుకూరు వారి వీధిలో సరిహద్దు తగాదాలపై రెండు వేర్వేరు కేసులు సోమవారం నమోదు చేసినట్లు చెప్పారు. వివరాల్లోకి వెళితే చిలుకూరు వారి వీధిలో బొప్పన వెంకటసుబ్బయ్యకు చెందిన స్థలాన్ని 2009లో ముదుండి సోమరాజు కొనుగోలు చేశారు. ఆ స్థలంలోకి ఈ నెల 15న వెళ్లగా బొప్పన కౌసల్య, సూర్యకుమార్, మరికొంత మంది తనపై దాడి చేసినట్లు సోమరాజు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సోమరాజు స్థలానికి సరిహద్దు స్థలం కోర్టు వివాదంలో ఉంది. ఆస్థల యజమాని కూతురు ప్రత్తిపాటి విశాల గుంటుపల్లి నుంచి వచ్చి తన తండ్రితో కలిసి స్థలం చూస్తుండగా సోమరాజు మరి కొంత మంది దాడిచేసి గాయపరచగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. ఇరువురి ఫిర్యాదులపై దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

21న అవగాహన సదస్సు

ఆకివీడు: ఆక్వా రంగంపై అవగాహన సదస్సు ఈ నెల 21న స్థానిక ప్రభుత్వ ఆక్వా లాబ్ , శిక్షణా కేంద్రంలో నిర్వహించనున్నట్లు మండల మత్స్యశాఖ అధికారి సీహెచ్.రాంబాబు సోమవారం చెప్పారు. ఎంపెడా, అప్పడా రిజిస్ట్రేషన్ల కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

మీకోసంలో ఐదు అర్జీలు

ఆకివీడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీ కోసం కార్యక్రమానికి ప్రజల నుంచి ఐదు అర్జీలు అందినట్లు ఎంపీడీఓ కందుల వాణి సోమవారం చెప్పారు. స్థల వివాదం, సరిహద్దు తగాదా, చేపల చెరువు భూమిని మ్యూటేషన్ చేయాలని, సర్వే నంబర్ ప్రకారం భూమి అప్పగించాలని తదితర ఫిర్యాదులు అందాయని తెలిపారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

భీమవరం: పట్టణంలోని జంక్షన్ రైల్వే స్టేషన్ వద్ద గల వాటర్‌ట్యాంక్ ఎక్కి ఒక వ్యక్తి హల్‌చల్ చేశాడు. వివరాల్లోకి వెళితే నాగరాజు అనే వ్యక్తి వాటర్‌ట్యాంక్ ఎక్కి తనకు ఇల్లు కట్టించి ఇవ్వాలంటూ హంగామా చేశాడు. దీంతో అప్రమత్తమైన రైల్వే ఏఎస్సై వెంకటేశ్వరరావు, టౌన్ పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని, నాగరాజుకు నచ్చజెప్పి ట్యాంక్ కిందకు దింపి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

భీమవరం అర్బన్: గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై ప్రతి విద్యార్థిని అవగాహన కలిగి యుండాలని భీమవరం ఐసీడీఎస్ సీడీపీవో టీకేవీ లక్ష్మీకాంతం సూచించారు. మండలంలోని శ్రీరామపురం అంగన్‌వాడీ సెంటర్లో సోమవారం 100 రోజుల మిషన్ శక్తి పథకంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్, ఏఎన్ఎమ్, ఆశా, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ డే

వీరవాసరం: ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా వీరవాసరం, పాలకోడేరు మండలాల ఫొటో, వీడియో గ్రాఫర్ యూనియన్ ఆధ్వర్యంలో నవుడూరు పద్దాల అంకమ్మ సన్నిధిలో సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యుడు రాయకుదురు గ్రామ చరిత్రను పుస్తక రూపంలో రాసిన ప్రముఖ రచయిత అడబాల లక్ష్మీనారాయణకు తమిళనాడు హుసూరు ఇంటర్నేషనల్ కల్చరల్ రీసర్చ్ అకాడమీ వారు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణను ఘనంగా సత్కరించారు. యూనియన్ అధ్యక్షుడు నవుడూరు పద్మ స్టూడియో అధినేత రెడ్డి, యూనియన్ ప్రధాన కార్యదర్శి యేసు రాజు, కోశాధికారి పాలకోడేరు వేంద్ర శ్రీను, వాణి స్టూడియో నాగేశ్వరరావు, వీరవాసరం నికిత శేఖర్ సమక్షంలో యూనియన్ తరపున సత్కరించారు. ప్రముఖ ఫొటోగ్రాఫర్స్ పాల్గొన్నారు.